
విద్యుత్ సరఫరాలేక మూగబోయిన డిజిటల్ టీవీ



అంధకారంలో అక్షరం

బడుల్లో పేరుకుపోయిన విద్యుత్ బిల్లు బకాయిలు

చెల్లించడంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

సరఫరా ఆపేస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

డిజిటల్ బోధనకు కరెంటు కష్టాలు

ఫైబర్‌నెట్ లాగారు... కనెక్షన్ మరిచారు..

కూటమి ప్రభుత్వంపై ఆశలు

కొత్తచెరువు

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన పాఠశాలల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. అక్షరం.. అంధకారంలో చిక్కుకుంటోంది. గత వైసీపీ ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ తరగతులు అంటూ హడావుడి చేసింది. డిజిటల్ టీవీలు సరఫరా చేశారు. వాటిని బిగించారు కూడా. విద్యుత్ విషయం మరిచారు. బిల్లుల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం చూపారు. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. చేసేదిలేక ట్రాన్స్‌కో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పాఠశాలలకు విద్యుత్ సరఫరా ఆపేస్తున్నారు. దీంతో డిజిటల్ స్క్రీన్లు ఉన్నా.. నిరుపయోగంగా పడివున్నాయి. ఫైబర్ నెట్ లైన్ కూడా లాగారు. కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో అది కూడా వేస్ట్. విద్యపై గత ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనం.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1159, ప్రాథమికోన్నత 230, జిల్లా పరిషత్, మున్సిపల్ హైస్కూళ్లు 230, కేజీబీవీలు 30, మోడల్ స్కూళ్లు 10, హాస్టళ్లు 30 ఉన్నాయి. వాటి నిర్వహణపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిందన్నది నిర్వివాదాంశం. జిల్లాలో సగం పాఠశాలలకు స్కూల్ గ్రాంటు ఇచ్చి.. మిగతా వాటికి ఎగ్గొట్టింది. దీంతో గ్రాంటు మంజూరుకాని పాఠశాలల నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బు ఖర్చుచేశారు. అందుకు సంబంధించిన నిధులు రాక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలోని ప్రతి పాఠశాల గదిలో నాలుగు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, ఎల్ఈడీ టీవీలు, మంచినీటి సరఫరాకు ఆర్వో ప్లాంటు, మరుగుదొడ్ల నిర్వహణకు మోటార్లు ఏర్పాటు చేశారు. వీటికి విద్యుత్ వాడకం అధికమైంది. దీంతో ఉన్నత పాఠశాలకు సగటున నెలకు రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు బిల్లులు వస్తున్నాయని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు.. పాఠశాలలకు విద్యుత్ వినియోగం అధికంగా ఉందనీ, కేటగిరి-2 కింద త్రీఫేస్ కనెక్షన్ తీసుకోవాలనీ, లేకపోతే సరఫరా ఆపేస్తామని తెలియజేస్తున్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయసంఘాల ద్వారా మాజీ ముఖ్యమంత్రి జగన్, మాజీ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో వారు పాఠశాలల విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. ఆ మేరకు ఉత్తర్వులు మాత్రం ఇవ్వలేదు. వారి హామీతో 8 నెలలుగా పాఠశాలల విద్యుత్ బిల్లులు చెల్లించలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా రూ.2కోట్ల వరకు విద్యుత్ బిల్లు బకాయిలు పేరుకుపోయినట్లు సమాచారం. ప్రతినెలా బిల్లులు మాత్రం పాఠశాలలకు ట్రాన్స్‌కో అధికారులు పంపుతున్నారు. కొన్నిచోట్ల మండలస్థాయి ట్రాన్స్‌కో అధికారులు.. బిల్లులు చెల్లించాలని ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. మరికొన్నిచోట్ల పాఠశాలలకు విద్యుత్ సరఫరా ఆపేస్తున్నారు. దీంతో డిజిటల్ విద్యాబోధనకు కరెంటు కష్టాలు తప్పట్లేదు. పాఠశాలల్లో బ్లాక్, గ్రీన్ బోర్డులు కూడా లేకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ విధానాలతో విద్యాబోధనకు తీవ్ర విఘాతం కలుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమస్యలపై దృష్టిసారించి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకురావాలని వారు కోరుతున్నారు.

కనెక్షన్ మరిచారు..

గత వైసీపీ ప్రభుత్వం డిజిటల్ టీవీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠాలు చెప్పే విధానాన్ని అమలు చేసింది. అందులో భాగంగా జిల్లాలోని పాఠశాలలకు లక్షల రూపాయల విలువచేసే డిజిటల్ టీవీలను సరఫరా చేసింది. చాలా పాఠశాలలకు డిజిటల్ టీవీలు సరఫరా కాలేదని ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. వాటితో విద్యాబోధన చేయాలంటే ఇంటర్నెట్ సదుపాయం ఉండాలి. ఫైబర్‌నెట్ లాగారు, కనెక్షన్ మాత్రం మరిచారు. దీంతో చాలా పాఠశాలల్లో డిజిటల్ టీవీలు నిరుపయోగంగా మారాయి. కొత్తచెరువులోని జిల్లాపరిషత్ బాలబాలికల పాఠశాలలే నిదర్శనం. కొందరు ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్ల ద్వారా డిజిటల్ టీవీలకు వైఫై కనెక్ట్ చేసుకుని, పాఠాలు చెబుతున్నారు. జిల్లా విద్యాధికారి కార్యాలయం ఉండే కొత్తచెరువులోనే పరిస్థితి ఇలా ఉంటే.. మారుమూల పాఠశాలల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

అందని స్కూల్ గ్రాంటు

జిల్లావ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, హాస్టల్‌స్కూల్స్ 2088 ఉన్నాయి. వీటి నిర్వహణకు ప్రభుత్వం స్కూల్ గ్రాంటును విద్యార్థుల సంఖ్యను బట్టి అందిస్తుంది. రెండేళ్లుగా స్కూల్ గ్రాంటును గత ప్రభుత్వం మంజూరు చేయలేదు. స్కూల్ గ్రాంటును సైతం ఇతర పథకాలకు మళ్లించింది. దీంతో పాఠశాల నిర్వహణకు నిధుల్లేక ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ బడుల విద్యుత్‌బిల్లు బకాయిలు ఉండటం వాస్తవమే. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషిచేస్తాం. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి పాఠశాలలకు విద్యుత్ సమస్యల లేకుండా చూస్తాం.

\- మీనాక్షి, డీఈఓ



మూలనపడిన నీటిశుద్ధి ప్లాంటు

మూలనపడ్డ నీటిశుద్ధి ప్లాంట్లు

పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు అందించేందుకు నాడు-నేడు కింద గత ప్రభుత్వం నీటిశుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణకు త్రీఫేస్ విద్యుత్ అవసరమని తెలిసి కూడా కాంట్రాక్టర్లు పాఠశాల కరెంటు కనెక్షన్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. దీంతో నీటిశుద్ధి ప్లాంట్లు మూలనపడ్డాయి. విద్యార్థులు ఇంటి నుంచి నీరు తెచ్చుకుంటున్నారు.



మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న మహిళలు

తాగునీటి కోసం మహిళల ఆందోళన

పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయింపు

పుట్టపర్తి, జూన్ 26: పట్టణంలోని 2వ వార్డులో తాగునీటి కష్టాలు తీర్చాలంటూ మహిళలు ఆందోళనకు దిగారు. బుధవారం కోటవీధి, పెద్దబజార్, రామాలయం వీధి ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్దఎత్తున మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని, అక్కడే బైఠాయించారు. పదిరోజులుగా తాగునీరు సరఫరా కాలేదని వాపోయారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యంపై కమిషనర్ అంజయ్యతో వాగ్వాదానికి దిగారు. వారం రోజుల్లో మోటారుకు మరమ్మతులు చేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని కమిషనర్ చెప్పుకొచ్చారు. తాము వారంరోజులపాటు నీరు లేకుండా ఉండాలా అని మహిళలు ప్రశ్నించారు. ట్యాంకర్‌తోనైనా సరఫరా చేయాలని కోరారు. మహిళలు ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు పీసీగంగన్న, రామాంజనేయులు, కుంటిమద్ది రామాంజనేయులు, మాల మనోహర్, రాము, మహబూబ్, రమణ తదితరులు అక్కడకు చేరుకుని వెంటనే తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. రెండ్రోజుల్లో తాగునీరు సరఫరా చేస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. మున్సిపల్ చైర్మన్ ఓబుళపతి ప్రాతినిధ్యం వహిస్తున్న 2వ వార్డులోనే తాగునీటి సమస్యతో జనం ఇబ్బందులు పడుతుండడం శోచనీయం.

ఇంటర్ సప్లీ ఫలితాల్లో జిల్లాకు 18వ స్థానం

కొత్తచెరువు, జూన్ 26: ఇంటర్మీడియట్ ఫస్టియర్ సప్లిమెంటరీ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లా 18వ స్థానంలో నిలిచిందని డీఐఈఓ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 3680 మంది పరీక్షలు రాయగా.. 1503 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. దీంతో 41 శాతం ఉత్తీర్ణత నమోదైందని ఆయన వెల్లడించారు.

28 నుంచి రీవెరిఫికేషన్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలపై రీ వెరిఫికేషన్‌కు విద్యార్థులు ఈనెల 28వ తేదీ నుంచి దరఖాస్తు చేయవచ్చు. వచ్చేనెల 4వ తేదీ వరకూ అవకాశం ఉంది. రీ వెరిఫికేషన్ కోసం విద్యార్థులు ప్రతి సబ్జెక్టుకు రూ. 1000 చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థుల మార్కుల జాబితాలు జులై 1 నుంచి ఇంటర్ బోర్డు పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నారు.

వేరుశనగ మొక్కలు చనిపోకుండా

చర్యలు తీసుకోండి

వ్యవసాయ శాస్త్రవేత్త జాన్సన్



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గోరంట్ల, జూన్ 26: వేరుశనగ మొక్కలు చనిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త జాన్సన్ తెలిపారు. మండలంలోని సింగిరెడ్డిపల్లి సమీపాన వెంకటరామప్ప సాగుచేసిన వేరుశనగ పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. అక్కడక్కడా వేరుశనగ చెట్లు చనిపోతుండడాన్ని శాస్త్రవేత్త జాన్సన్ గమనించారు. ఆయన మాట్లాడుతూ.. ఎక్సాకోనజల్ 2 ఎం.ఎల్ ద్రావణాన్ని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతుకు సూచించారు. వేరుశనగలో పచ్చపురుగు నివారణకు కినాల్‌ఫాస్ 2 ఎం.ఎల్‌గానీ, క్లోరోఫైరిపాస్ 2.50 ఎం.ఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. మొక్కజొన్న విత్తే ముందు 50 కిలోల యురియా, 150 కిలోల సింగల్ సూపర్‌పాస్ఫేట్, 25కిలోల పొటాష్ ఎరువులు ఎకరాలో దుక్కి చేసుకోవాలన్నారు. కత్తెర పురుగు సోకకుండా పొలం చుట్టూ నాలుగు సాళ్లలో జొన్నగానీ, సజ్జగానీ వేసుకోవాలని సూచించారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజేట్ 80గ్రాములు ఎకరాకు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, రైతులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



వైభవంగా శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవం

కదిరి, జూన్ 26: పట్టణంలో వెలసిన శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి ఆర్జిత కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామివారు, అమ్మవార్లను పట్టు వస్త్రాలు, కదిరి మల్లెలు, తులసి మాలలతో అలంకరించారు. స్వామివారి కల్యాణం కనులపండువగా సాగింది.

కరోనా కంటే భయంకరం డ్రగ్స్

పిల్లలు దూరంగా ఉండాలి..

బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి: ఎస్పీ

పురంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దిన ర్యాలీ

హిందూపురం, జూన్ 26: ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి కన్నా భయంకరమైంది డ్రగ్స్ అని జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో పాఠశాల విద్యార్థులతో పోలీసులు ర్యాలీ నిర్వహించారు. చిన్నమార్కెట్ నుంచి బెంగళూరు రోడ్డుమీదుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. 'విద్యార్థులు డ్రగ్స్‌కు నో చెబుదాం.. బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం. గంజాయి మానేద్దాం.. జీవితాలు బాగు చేసుకుందాం...' అంటూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ.. యువత మత్తుకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఇంటిని, గ్రామాన్ని, సమాజాన్ని నాశనం చేస్తాయన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డ్రగ్స్ నివారణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. డ్రగ్స్‌తో ఆలోచించే శక్తిని కోల్పోయి, సామాజిక, మానసిక, శారీరక అనారోగ్యం బారినపడతారన్నారు. అనంతరం విద్యార్థులతో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెబ్ ఏఎస్పీ నాగభూషణం, సెబ్ ఏఈఎస్ సుబ్రహ్మణ్యం, పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైదా, సీఐలు శ్రీనివాసులు, రియాజ్‌అహ్మద్, అప్‌గ్రేడ్ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ

టెన్త్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

కొత్తచెరువు, జూన్ 26: పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లావ్యాప్తంగా 4934 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 3401 మంది ఉత్తీర్ణులయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తెలిపారు. 61.16 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె వెల్లడించారు.

మళ్లీ మంచిరోజులు

- పురంలో ఐదేళ్లుగా రియల్ వ్యాపారం డీలా
- కూటమి ప్రభుత్వంతో రియల్టర్లలో ఆశలు
- స్థిరాస్తి రంగం పుంజుకుంటుందన్న నమ్మకం
- అడ్వాన్సులు ఇస్తున్న వ్యాపారులు

హిందూపురం, జూన్ 26: వైసీపీ ఐదేళ్ల పాలనలో రియల్ వ్యాపారం డీలా పడింది. అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు స్థిరాస్తి వ్యాపారాన్ని దారుణంగా దెబ్బకొట్టాయి. ఐదేళ్లలో భూముల క్రయవిక్రయాలు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఇసుక విధానం, రియల్ వ్యాపారులపై వైసీపీ నాయకులు దాడులు, బెదిరింపులు, కబ్జాలతో స్థిరాస్తి వ్యాపారం పూర్తిగా దెబ్బతింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో రియల్ వ్యాపారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. రియల్ వ్యాపారం పుంజుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వ్యాపారాలు మొదలెట్టారు. భూముల కొనుగోలుకు అడ్వాన్సులు ఇచ్చేస్తున్నారు.

ఐదేళ్లుగా డీలా

వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రియల్ వ్యాపారం కుదేలైంది. కొన్నిచోట్ల కొనుగోలు చేసిన భూములు, ప్లాట్లు ఎవరూ అడగని పరిస్థితి ఏర్పడింది. కొన్ని సందర్భాల్లో కోట్ల రూపాయల విలువచేసే భూములను సైతం వ్యాపారులు లక్షలకు కొనేందుకు జంకారు. వైసీపీ పాలనలో ఎక్కడ లేఔట్ వేయాలన్నా ఆ పార్టీ నాయకులను ఆశ్రయించాల్సి రావడమే ఇందుకు ప్రధాన కారణం. వారికి కొంతమొత్తం ముట్టజెప్పాల్సిందే. కొన్ని ప్లాట్లు సైతం వారికి అప్పగించాలి. చోటామోటా నాయకులకు ఖర్చులకు సైతం ఇచ్చుకోవాలి. వైసీపీ నేతల తీరుతో వెంచర్లు వేసే వ్యాపారులు పరారయ్యారు. హిందూపురం ప్రాంతంలో కర్ణాటకకు చెందిన కొంతమంది లేఔట్లు వేశారు. వారిని అప్పట్లో వైసీపీ నాయకులు బెదిరించారు. బెంగళూరు రోడ్డుకు ఆనుకుని ఒక లేఔట్ వేశారు. అందులో అధికార పార్టీ నాయకులు అడిగినంత ఇవ్వలేక ఆ రియల్టర్ బెంగళూరుకు మకాం మార్చారు. పరిగి మండలంలో లేఔట్లు వేసినవారి నుంచి వైసీపీ నాయకులు భారీఎత్తున డిమాండ్ చేయడంతో వారు మధ్యలోనే ఆపేశారు. హిందూపురం పట్టణ పరిధిలో కూడా కొంతమంది రియల్ వ్యాపారులు లేఔట్లు వేయడానికి ప్రయత్నించగా వైసీపీ నాయకులు అడిగినంత ఇవ్వలేక మధ్యలోనే కర్ణాటకకు తరలి వెళ్లారు. ఇసుక పాలసీ భవన నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. ఇన్ని సమస్యలు చుట్టుముట్టడంతో రియల్ వ్యాపారం పడకేసింది. ఐదేళ్లు అడుగు ముందుకు పడలేదు.

ధరలు పెరగవచ్చన్న ఆశలు

ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో రియల్ వ్యాపారం పుంజుకుంటుందన్న ఆశలు వ్యాపారుల్లో చిగురిస్తున్నాయి. విలువైన ప్రాంతాల్లో ప్లాట్లు, భూములకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. మరికొన్నిరోజులకు ధరలు పెరిగే అవకాశం ఉందని అడ్వాన్సులు ఇస్తూ.. తమ వద్ద భూములకు సంబంధించిన పత్రాలు పెట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. హిందూపురం పట్టణానికి ఆనుకుని బెంగళూరుకు వెళ్లే రహదారిలో మూడెకరాల స్థలాన్ని అనంతపురానికి చెందిన ఓ వ్యాపారి అడ్వాన్సు చెల్లించి, అగ్రిమెంట్ వేసుకున్నాడు. ఇప్పటి వరకు ఆ భూమిని ఎవరూ అడిగేవారుకాదు. కూటమి రావడంతో విక్రయాలు పుంజుకుని, ధరలు పెరుగుతాయన్న నమ్మకంతో సదరు వ్యాపారి అగ్రిమెంట్ వేసుకున్నట్లు తెలుస్తుంది. లేపాక్షి మండలంలో ప్రధాన రహదారికి ఆనుకుని, లేఔట్ వేసేందుకు బెంగళూరుకు చెందినవారు పదెకరాల పొలాన్ని కొనుగోలు చేశారు. సదరు రైతులు మూడేళ్లుగా విక్రయించాలని ముందుకొచ్చినా.. కొనుగోలు చేయడానికి వెనకడుగు వేసేవారు. నాలుగు రోజుల క్రితం అగ్రిమెంట్ వేసుకున్నారు. పట్టణంలో పలుచోట్ల ఇంటి స్థలాలకు సంబంధించి అగ్రిమెంట్లు, అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. ఎన్నికల ముందుకంటే పదిశాతం ధరలు పెరిగినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రియల్ వ్యాపారుల్లో ఆశలు పెరిగాయి. ఇప్పటి వరకు భూమి కొనాలంటే భయపడేవారు, ప్రస్తుతం ఉత్సాహం చూపుతున్నట్లు తెలుస్తోంది.

మత్స్యకారుల జీవితాలు.. అతలాకుతలం..!

- ఐదేళ్ల వైసీపీ పాలనలో సంక్షేమానికి దూరం
- సబ్సిడీ చేపపిల్లల పదమే వినని వైనం
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 26: వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారుల జీవితాలు అతలాకుతలం అయ్యాయి. అలివిగాని హామీలిచ్చి గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్లపాలనలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా... గతంలో ఉన్న సంక్షేమ పథకాలన్నీ నిర్వీర్యం చేసి, మత్స్యకారుల జీవితాలు మసకబారేలా చేశారనే చెప్పాలి. కనీసం చేపల వేటకెళ్లే మత్స్యకారులకు తెప్పలు, వలలు, బోట్లు తదితర సామగ్రిని అందించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఫలితంగా ఎంతోమంది మత్స్యకారులు తమ సొంత డబ్బులతో పరికరాలు కొనుగోలు చేసి వేటకు వెళ్లాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. మరికొందరు తమ వృత్తిని సైతం వదులుకొని పట్టణాలకు వలసబాట పట్టారు. మరోవైపు సబ్సిడీతో అందించాల్సిన చేపపిల్లల పథకాన్ని అటకెక్కించి వారిని ఆర్థికంగా తీసింది గత ప్రభుత్వం. ఇలా ఐదేళ్లుగా నరకయాతన అనుభవించిన మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వారిలో మళ్లీ ఆశలు చిగురింప చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు విశాఖలో మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో గతంలో ఏవైతే సంక్షేమ పథకాలు అమలు చేశామో వాటి గురించి ప్రస్తావించడం, మరోవైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సైతం కృష్ణా జిల్లా ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుతో కలిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. మత్స్యకారులకు తీర ప్రాంతాల్లో జెట్టీలు నిర్మిస్తామని, ఉపాధి కల్పించే బాధ్యతను తీసుకుంటామని హామీల వర్షం కురిపించారు. ఈ నేపథ్యంలో మత్స్యకారులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకోవడంతో హామీలు నెరవేరుతాయన్న గట్టి నమ్మకంతో ఉన్నారు.


టీడీపీ హయాంలో అందించిన ఐస్‌బాక్సులతో కూడిన టూవీలర్లు

సంక్షేమానికి దూరం

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జిల్లాలోని మత్స్యకారుల జీవనోపాధుల మెరుగు కోసం ఎటువంటి సబ్సిడీలు లేకుండా ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసింది. 2016-17, 2017-18 సంవత్సరాలకు గానూ జిల్లాలోని అన్ని సొసైటీ, గ్రామ పంచాయతీ, ఇరిగేషన్ తదితర వాటికింద ఉన్న చెరువులన్నింటికీ చేపపిల్లలను ఉచితంగా అందించింది. ఒక హెక్టారు విస్తీర్ణం ఉన్న చెరువులకు 2,300 చేప పిల్లలు చొప్పున ఆయా చెరువుల విస్తీర్ణాన్ని బట్టి ఉచితంగా పంపిణీ చేసింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ చేపపిల్లల పంపిణీని అడ్డుకుందనే చెప్పాలి. ఈ చేపపిల్లలను పంపిణీ చేసే టెండరుదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకుండా మత్స్యకారుల పొట్టకొట్టింది. ఫలితంగా ఆ టెండర్‌దారులు చేపపిల్లల సరఫరాను నిలిపివేశారు. దీంతో జిల్లాలోని పలువురు మత్స్యకారులు పక్క రాష్ట్రాలు, జిల్లాల నుంచి చేప పిల్లలను కొనుగోలు చేసుకొని పెంపకం చేపట్టి వచ్చిన అరకొర లాభాలతో జీవనాన్ని నెట్టుకొచ్చారు. మరోవైపు మత్స్యకారులను ఆదుకునేందుకు టీడీపీ ప్రభుత్వం సబ్సిడీతో పరికరాలు అందించింది. చేపల వేటకు వెళ్లే సమయంలో తెప్పలు, బోట్లు, మరబోట్లు, వలలు తదితర పరికరాలతో పాటు చేపల రవాణా కోసం టూవీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్, చేపల నిల్వ కోసం ఐస్ బాక్సులను అందించేవారు. వీటన్నింటిని వాటి ధరలకు అనగుణంగా బీసీలకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీలతో మత్స్యకారులకు అందించింది. వాటిని సైతం వైసీపీ ప్రభుత్వం పక్కనబెట్టేసి వారిని సంక్షేమాలకు దూరం చేసిందన్న విమర్శలు ఆ వర్గాల నుంచే వినిపించాయి.



మత్స్యశాఖ కార్యాలయం

పీఎంఎంఎస్‌వైతో మసిపూసే యత్నం

మత్స్యకారుల నుంచి వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో... ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన(పీఎంఎంఎస్‌వై) అందించే సంక్షేమ పథకాలను తామే అందిస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం ఫోజులిచ్చింది. ఈ పథకం కింద మినీ ఫిష్ వెండింగ్ సెంటర్లు, కూలింగ్ యూనిట్లు, ఫిష్ పాండ్ల నిర్మాణం, చేపల రవాణాకు టూవీలర్, ఫోర్ వీలర్, చేపల అమ్మకం కోసం మినీ షెడ్లు తదితర వాటిని పొందుపరిచారు. వీటన్నింటిని కేటగిరీల వారిగా సబ్సిడీలు వర్తిస్తాయని అందులో పొందుపరిచారు. అయితే వీటిన్నింటిని చూసిన మత్స్యకారులు, వ్యాపారులు పోటాపోటీగా దరఖాస్తులు చేసుకున్నారు. ఆ పథకాన్ని సక్రమంగా అమలు పరచడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు లేకపోలేదు. కనీసం మత్స్యకారులు చేసుకున్న దరఖాస్తులు పరిశీలించిన పాపాన పోలేదు. వచ్చిన వాటిని చెత్తబుట్టలకే పరిమితమయ్యాయన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమయ్యాయి.

చంద్రబాబుతోనే వెలుగులు..



వైసీపీ ఐదేళ్ల పాలనలో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. సంక్షేమ పథకాలను ఎత్తేయడంతో పాటు... ఏవేవో అమలు కాని ఫిష్ మార్కెట్లు, హబ్‌లని చెప్పి మత్స్యకారుల జీవితాలు నాశనం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో అందించిన ఉచిత చేపపిల్లలతో ఎంతో మంది మత్స్యకారులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. గతంలో మాదిరిగానే చంద్రబాబునాయుడు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతారని ఆశిస్తున్నాం.

-చేపల హరి, బెస్త సాధికారిత రాష్ట్ర కమిటీ సభ్యుడు

వైసీపీ పాలనలో ఉపాధి కోల్పోయాం...



వైసీపీ పాలనలో ఉపాధిని కోల్పోయాం. ఒక వల, ఒక బోటు, తెప్పలు ఇలా ఏవీ ఇవ్వకుండా చేసింది. మేమే చేతుల నుంచి తెచ్చుకొని వేటకు వెళ్లేవాళ్లం. టీడీపీ ప్రభుత్వంలో అన్ని పథకాలు వర్తించాయి. చేపలు నిల్వ ఉంచుకోవడానికి ఐసు బాక్సులు, రవాణా చేసుకునేందుకు టూవీలర్, ఫోర్ వీలర్లు అందించింది. మళ్లీ టీడీపీతోనే న్యాయం జరుగుతుందనే ఎన్నికల్లో మద్దతు పలికాం.

- బెస్త శంకర్, శింగనమల

మళ్లీ సంక్షేమ పథకాలు వస్తాయి..



టీడీపీ గవర్నమెంటు వచ్చింది. మళ్లీ ఇంతకుముందు ఇచ్చినట్లే అన్ని పథకాలు వస్తాయి. ఆ నమ్మకంతోనే చంద్రబాబునాయుడును గెలిపించుకున్నాం. వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారుల జీవితాలు నాశనమయ్యాయి. చేతి నుంచి డబ్బులు పెట్టుకొని చేపలు, తెప్పలు ఇలా చెప్పుకుంటూ అన్ని ఖర్చు పెట్టిందేగానీ... లాభం ఏం మిగలలేదు. ఇంతకుముందు మాదిరి ఉచితంగా చేపపిల్లలు, స్కూటర్లు అందించాలి.

- కృష్ణమూర్తి, మత్స్యకారుడు, శింగనమల

నట్టేట ముంచింది..



వైసీపీ ప్రభుత్వం ఫిష్‌ఆంధ్రాలని చెప్పి మత్స్యకారులను నట్టేట ముంచింది. ఊరికే రూ.30వేలు కట్టించుకొని లేనిపోనివన్ని చెప్పి నాశనం చేసింది. ఆ షాపులతో ఒరిగిందేమీ లేదు. అంతా నష్టమే. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వమొచ్చింది. ముందు మాదిరిగానే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేసి ఫిష్ ఆంధ్రాలు లేకుండా సబ్సిడీలతో ఉండే మరిన్ని పథకాలు అమలు చేసి మత్స్యకారుల జీవనోపాధులు మెరుగుపడతాయి.

-కుళ్లాయప్ప, మత్స్యకారుడు, బుక్కరాయసముద్రం

హౌసింగ్ పీడీగా శైలజ

- అక్రమార్కుల్లో వణుకు
- గుట్టురట్టయ్యేనా...?


బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి పీడీ శైలజ

అనంతపురం, సిటీ, జూన్ 26: ఎట్టకేలకు జిల్లా గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి పీడీగా (ఎఫ్ఏసీ) అనంతపురం ఈఈగా పనిచేస్తున్న శైలజను నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె సాయంత్రం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆశాఖ గత ఇన్‌చార్జి పీడీ నరసింహారెడ్డి 15 రోజులపాటు సెలవులో వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆమె జూలై 10వ తేదీ వరకు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆమెకు పలువురు డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిశారు. గతంలో జరిగిన అక్రమాలపై తాజా ఇన్‌చార్జి పీడీ అప్పట్లోనే సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. వైసీపీ అధికారంలో ఉండటం, తోపు అండతో అనకొండ డీఈఈ, అప్పటి ఇన్‌చార్జి పీడీ సదరు నివేదికను కలెక్టర్‌కు పంపకుండా తొక్కిపెట్టారు. తాజాగా ఆమెను ఇన్‌చార్జి పీడీగా నియమించడంతో ఆశాఖలోని అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. ఇప్పటికే పత్రికల్లో జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో సాగిన అక్రమాలపై కథనాలు రావడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో నూతన ఇన్‌చార్జి పీడీ గతంలో మాదిరిగానే.. ముక్కుసూటిగా వ్యవహరించి అవినీతి అక్రమార్కుల పని పడతారా? వారి గుట్టును రట్టయ్యే విధంగా చర్యలు తీసుకుంటారా అనే చర్చలు హౌసింగ్ శాఖ ఉద్యోగ వర్గాల్లో జోరుగా సాగుతున్నాయి.

ప్రతి మండలంలో పశువైద్య శిబిరాలు

- పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం అర్బన్, జూన్ 26: జిల్లాలోని ప్రతి మండలంలో నిర్దేశించిన తేదీల్లో పశువైద్య శిబిరాలు (గైనిక్ క్యాంపులు) ఏర్పాటు చేస్తున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు కళ్యాణదుర్గం, కణేకల్లు, బ్రహ్మసముద్రం, గుమ్మగట్ట, రాయదుర్గం, డి. హిరేహాళ్, కంబదూరు, బెళుగుప్ప మండాల్లోని ఒక్కో గ్రామంలో గైనిక్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే నెలాఖరు దాకా జిల్లాలోని ఏఏ మండలంలోని ఏఏ గ్రామాల్లో ఏ తేదీలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసే షెడ్యూల్‌ను విడుదల చేశామన్నారు. పశువులకు పలు రకాల రోగాలకు చికిత్సలు చేయడంతోపాటు కృత్రిమ గర్భధారణ తదితర అంశాలపై పాడి రైతులకు అవగాహ కల్పించి, ప్రోత్సహిస్తామని తెలిపారు. స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో సంప్రదించి నిర్దేశించిన తేదీల్లో శిబిరానికి హాజరై పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

త్వరలో 70 కొత్త బస్సులు

- ఆర్టీసీ ఆర్ఎం సుమంత్

ఉరవకొండ, జూన్ 26: జిల్లాకు 70దాకా కొత్త బస్సులు త్వరలో వస్తాయనీ, వాటిలో 40 సంస్థకు చెందిన, మరో 30 అద్దె ప్రాతిపదికన తీసుకుంటామని ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆదోని తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్యారేజీని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉరవకొండ, గుంతకల్లు డిపోలలో గ్యారేజీ యార్డు, సిమెంట్, కాంక్రీట్ పనులను రూ.54 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. కారుణ్య నియామకాల కింద 89 మందిని నియమించామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 245 మంది డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ, ఇంధన పొదుపుపై వారం రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. 2023-24 సంవత్సరంలో అన్ని పారామీటర్లలో లక్ష్యం అధిగమించినందుకు జిల్లాకు అవార్డు వచ్చిందన్నారు. జిల్లాలోని 7 డిపోల పరిధిలో 491 బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ బాలాజీ దయాల్ పాల్గొన్నారు.

కుళ్లిన చికెన్... కల్తీ నూనె..!

- ఫ్రిజ్‌లలో చికెన్ పెట్టి అమ్ముతున్న రెస్టారెంట్లు
- ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో బట్టబయలు


ఫ్రిజ్‌లో ఉంచిన చికెన్

కళ్యాణదుర్గం, జూన్ 26: పట్టణంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బుధవారం పలు హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించగా నిర్వహించిన కళ్లుతిరిగే వాస్తవాలు బయటపడ్డాయి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో దేవాన్ష్ రెస్టారెంట్, విజయదుర్గ, చాంద్ హోటళ్లలో ఆకస్మిక దాడులు చేశారు. దాడుల్లో నాసిరకం కల్తీనూనె వినియోగించి వినియోగదారులకు ఆహారం అందిస్తున్నారని బయటపడింది. దాంతోపాటు దేవాన్ష్ రెస్టారెంట్లో ఫ్రిజ్‌లో నిల్వ వుంచిన కోడి మాంసాన్ని గుర్తించారు. చికెన్ మాంసంలో టేస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్ అధిక మోతాదులో వినియోగిస్తే ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని గుర్తించారు. నిల్వవుంచిన చికెన్‌ను బయట పడేశారు. దేవాన్ష్ రెస్టారెంట్‌కు నోటీసులు అందించారు. నిబంధనలను అతిక్రమించి హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నిల్వ ఉంచిన చికెన్‌ను డస్ట్‌బిన్‌లో వేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

గాలిమరలో చెలరేగిన మంటలు

కళ్యాణదుర్గం, జూన్ 26: మండల పరిధిలోని ఉప్పొంక గ్రామ సమీపంలో వున్న గ్రీన్‌కో కంపెనీ గాలిమర రెక్కల నుంచి బుధవారం మంటలు చెలరేగి ద ట్టమైన పొగలు వ్యాపించాయి. ఆ దారి లో వెళుతున్న పాదచారులు పొగలను చూసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సమాచారం అందుకున్న కంపె నీ ప్రతినిధులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంటలు చెలరేగడానికి కారణాలను పరిశీలించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.


గాలిమర నుంచి వస్తున్న పొగ

ఇళ్ల వద్దకే పింఛన్

- జూలైలో రూ.197 కోట్ల పంపిణీకి సిద్ధం
- జిల్లాకు అదనంగా రూ.110 కోట్లు
- గ్రామ-వార్డు సచివాలయ సిబ్బందితో పంపిణీ

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 24: ఇళ్ల వద్దకే పింఛన్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మూడు నెలలుగా ఇబ్బంది పడిన పండుటాకులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఓ వైపు పింఛన్ పెంచుతూ... మూడు నెలల బకాయిలతో కలిపి ఇంటి వద్దకే సొమ్మును అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నుంచే అమలు చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు ఆ మేరకు అమలుపై దృష్టి సారించారు. ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలతోపాటు జూలై నెలతో కలిపి చెల్లించాలని చర్యలు చేపట్టారు. జిల్లాకు 2,89,508 మంది పింఛన్‌దారులకు రూ.197.44కోట్లు నిధులు మంజూరు చేసింది. పింఛన్‌దారులు 2,89,805 మందికి రూ.126.81 కోట్లు, బకాయిలు రూ.70.62కోట్లు మొత్తం రూ.197.44కోట్లు జిల్లాకు కేటాయించారు. గతంలో రూ.3000 పింఛన్‌ను ఏప్రిల్ నెల నుంచి రూ.4000కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధులు 1,44,396 మందికి రూ.101 కోట్లు, వితంతువులు 66,749మందికి రూ.46.72 కోట్లు, చేనేతలు 6,759 మందికి రూ.4.73 కోట్లు, కల్లుగీత కార్మికులు 354 మందికి రూ.24లక్షలు, మత్స్యకారులు 890మందికి రూ.62లక్షలు, ఒంటరి మహిళలు 6,737మందికి రూ.4.70 కోట్లు, సఫాయి కర్మచారులు 3,525 మందికి రూ.2.41కోట్లు, హిజ్రాలు 207 మందికి రూ.1.45లక్షలు, హెచ్ఐవీ బాధితులు 2,476మందికి రూ.1.70కోట్లు, డప్పు కళాకారులు 3,137 మందికి రూ.2.19కోట్లు, కళాకారులు 185మందికి రూ.1.30లక్షలు, దివ్యాంగులు 46,351మందికి రూ.27.81 కోట్లు, కుష్టు వ్యాధి బాధితులు 391మందికి రూ.23 లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,444మందికి రూ.2,16కోట్లు, ప్రమాద బాధితులు 1091 మందికి రూ.1.63 కోట్లు ఇతరత్రా బాధితులకు కలిపి రూ.197.44 కోట్లు జూలైలో పంపిణీకి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జూలై 1వ తేదీ నుంచి ఇంటివద్దకే పింఛన్‌లు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ ఈశ్వరయ్య తెలిపారు.

పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ: డీఎస్‌ఓ

అనంతపురం టౌన్, జూన్ 26: జిల్లాలో పాత పద్ధతిలోనే జూలై నెల రేషన్ సరకులు పంపిణీ చేస్తామని డీఎస్‌ఓ శోభారాణి బుధవారం తెలిపారు. జూన్ నెల సరకులను జూలై 1 నుంచి 15వ తేదీ వరకు ఎండీయూ వాహనాల ద్వారానే లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు. జిల్లాలో 1,645 రేషన్‌షాపులు ఉన్నాయని, ఇప్పటికే బియ్యం, సరుకులు సరఫరా చేశామని అన్నారు. జొన్నలు అందుబాటులో ఉన్నాయని, బియ్యంతోపాటు రెండు కిలోల జొన్నలు పంపిణీ చేస్తామని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో రాగులు మిగిలాయనీ, అక్కడ బియ్యంతోపాటు రాగులు ఇస్తామని అన్నారు. రాగిపిండి సరఫరా చేయటం లేదని అన్నారు. ఇంకా నాలుగురోజులు సమయం ఉందని, అప్పటికి ఏమైనా నిబంధనలు వస్తే ఆ ప్రకారం లబ్ధిదారులకు రేషన్ సరకులు పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

హరిత అనంతగా తీర్చిదిద్దాలి: కలెక్టర్


మొక్కలు నాటి సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

అనంతపురం అర్బన్, జూన్ 26: జిల్లాను హరిత అనంతగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. మొక్కలను నాటి, సంరక్షణ బాధ్యతలను కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లకు అప్పగించారు. ఈ మేరకు వారికి దత్తత సర్టిఫికెట్లను అందజేశారు. జిల్లాలో ఈ నెలలో 100 కి.మీ. పరిధిలో లక్ష మొక్కలు నాటిస్తామని అన్నారు. ప్రతి మైదానం, వీధుల్లో మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించేందుకు దత్తత ఇస్తామని అన్నారు. నగరంలో నాటిన మొక్కలను సంరక్షించేందుకు వార్డుల వారీగా బాధ్యత కలిగిన అధికారులను నియమిస్తామన్నారు. నగరంలో మొక్కల పెంపకాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

టీడీపీకి ప్రచారం చేసినందుకు కక్ష సాధింపు

ఉరవకొండ, జూన్ 26: సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున ప్రచారం చేసినందుకు తనను పొదుపు సంఘం నుంచి తొలగించారని తులసి అనే మహిళ ఆందోళనకు దిగారు. యానిమేటర్, సీసీ కక్షసాధింపు చర్యలకు దిగారని ఆమె ఆరోపించారు. సీసీ వైఖరిని నిరసిస్తూ ఉరవకొండలోని వైకేపీ కార్యాలయం ఎదుట బుధవారం బైఠాయించి, నిరసన తెలిపారు. తనకు సమాచారం ఇవ్వకుండా సీసీ నారాయణస్వామి సంఘం నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయంలోకి వెళ్లి సీసీతో వాగ్వాదానికి దిగారు. ఎవరు చెపితే తనను తొగించారని నిలదీశారు. ఏపీఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు. 2003 నుంచి సంఘంలో ఉన్నాననీ, వైసీపీకి పని చేయాలని సీసీ ఒత్తిడి చేశారని ఆరోపించారు. ఆసరా డబ్బు తమ అకౌంట్‌లోకి కాకుండా అంగన్‌వాడీ టీచర్ ఖాతాలోకి ఎలా వేస్తారని ప్రశ్నించారు. సంఘం లీడర్‌కు తెలియకుండా ఫోర్జరీ సంతకాలతో డబ్బు స్వాహా చేశారని, సీసీ, యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె.. అధికారులను కోరారు.


సీసీని నిలదీస్తున్న తులసి


ధర్నా చేస్తున్న మహిళా సంఘం సభ్యురాలు

కోటంక ఆలయంలో చోరీ కేసు ఛేదింపు

- నలుగురు దొంగల ముఠా అరెస్టు
- బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

అనంతపురం క్రైం, జూన్ 26: గార్లదిన్నె మండలం కోటంక గ్రామ సమీపంలోని గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో జరిగిన చోరీ కేసును సీఎస్, గార్లదిన్నె పోలీసులు ఛేదించారు. ఈనెల 20వ తేదీన ఆలయ తాళాలు పగలకొట్టి లోపలికి చొరబడిన దొంగలు స్వామి మూలవిరాట్‌కు ధరింపజేసే రూ.13లక్షల విలువైన 16కిలోల వెండి ఆభరణాలు, 8తులాల బంగారు ఆభరణాలు, రెండు హుండీలు పగలకొట్టి రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు ఈ ఘటనలో నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేశారు. వారి నుంచి 16తులాల వెండి ఆభరణాలు, నాలుగు బంగారు తాళిబొట్లు, రెండు బైక్‌లు, రూ.2500 నగదు, ఐరన్‌రాడ్, కట్టర్, కట్టింగ్‌ప్లేయర్, క్యాటర్ బాల్, సిసి కెమెరాల హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీసీఎస్ సీఐ ఇస్మాయిల్, శింగనమల సీఐ శ్రీధర్, ఎస్ఐలతో కలిసి అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి వివరాలు వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న పోలీసులు

అరెస్టయిన నిందితులు వీరే...

శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం తురకలాపట్నం గ్రామానికి చెందిన పవన్‌కుమార్, కడప జిల్లా సీకే దిన్నె మండలం ఎంఎంఎస్ మీదికి తండాకు చెందిన ఆవుల రాము, కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మదరం గ్రామానికి చెందిన వెంకటరమణ, కడప జిల్లా కేంద్రం బాలకృష్ణ నగర్‌కు చెందిన శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో పవన్‌కుమార్ కర్ణాటక రాష్ట్రం కోలార్, కొరటగేరీ, పట్టణాయక్ హళ్లి, కడప జిల్లా లింగాల, సిద్దవటం పోలీస్‌స్టేషన్లలోని దేవాలయాల దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఆవుల రాముపై ప్రకాశం జిల్లా మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో గంజాయి కేసు ఉంది.

రెక్కీ నిర్వహించి.. జైలుకెళ్లి..

ఈ కేసులో పవన్‌కుమార్ కీలకం. గత కొన్ని సంవత్సరాల నుంచి ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్నాడు. ప్రముఖ ఆలయాల్లో నిఘా పెట్టి దొంగతనాలు చేసేవాడు. ఈ క్రమంలో ఈ చోరీ ఘటనకు ముందు గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో రెక్కీ నిర్వహించాడు. అదే సమయంలో ఓ కేసులో కడప సెంట్రల్ జైలుకు వెళ్లాడు. అక్కడ గంజాయి కేసులో అరెస్టయిన ఆవుల రాము, వెంకటరమణ, శ్రీనివాసులతో పరిచయం కలిగింది. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బంగారు, వెండి ఆభరణాల గురించి చెప్పాడు. బెయిల్‌పై జైలు నుంచి విడుదలదయ్యారు. విడుదలైన 15రోజుల్లోనే ఆలయంలో చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. చోరీ ఘటన నేపథ్యంలో పాత నేరస్తులను విచారిస్తున్న క్రమంలోనే పవన్‌కుమార్ గురించి బయటపడింది. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగతనం చేసిన నిందితులను బుధవారం అరెస్ట్ చేశారు. కేసును ఛేదించి సొత్తు స్వాధీనం చేసుకున్న సీఐలు శ్రీధర్, ఇస్మాయిల్, ఎస్ఐ గౌస్. హెచ్‌సీలు ఫిరోజ్‌సాహెబ్, దివాకర్, ప్రసాద్, చంద్రశేఖర్, శ్రీధర్ పాణి, మల్లికార్జున, శ్రీనివాసులు కానిస్టేబుళ్లు దేవ్లానాయక్, రంజిత్‌కుమార్, బాలకృష్ణను ఎస్పీ గౌతమిశాలి అభినందించారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

- ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలి
- పోలీస్ అధికారులు, న్యాయాధికారుల సూచన
- పలు ప్రాంతాల్లో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలు



ధర్మవరంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న సెబ్ సీఐ, సిబ్బంది



కొత్తచెరువులో..



బుక్కపట్నంలో..



కుమ్మరవాండ్లపల్లిలో..

ధర్మవరంరూరల్, జూన్26: మాదకద్రవ్యాలైన మద్యం, పొగాకు, గుట్కా, గంజాయి తదితరాలను వినియోగిస్తే జీవితం నాశనమవుతుందని, ప్రతిఒక్కరూ వాటికి దూరంగా ఉండాలని ధర్మవరం సెబ్ సీఐ గురుప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెబ్ సీఐ విద్యార్థులతో మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిసలై జీవితాన్ని పాడుచేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని చదువులకు పంపిస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయరాదని తెలిపారు. ఎవరూ చెడు అలవాట్ల జోలికి పోకుండా చదువుపై దృష్టి సారించాలని అన్నారు. అప్పుడే భవిష్యత్తు బాగుంటుందని చెప్పారు. అనంతరం మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీధర్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బత్తలపల్లి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఎస్ఐ శ్రీనివాసులు విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. వాటికి అలవాటు పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. అనారోగ్యానికీ గురవుతారని చెప్పారు. కనుక ఎవరూ వాటి జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉన్నారు.

కొత్తచెరువు: మండలకేంద్రంలో స్పెషల్ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో సెబ్ అధికారులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు కలిసి ర్యాలీ నిర్వహించారు. నాలుగురోడ్ల కూడలి నుంచి ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగింది. నెహ్రూ కూడలిలో మానవహారంగా ఏర్పడి మత్తు పదార్థాలను వినియోగించరాదని నినాదాలు చేశారు. సీఐ రాజారమేష్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నెలకొల్పుదామని పిలుపునిచ్చారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో ఎస్ఐ వంశీకృష్ణ విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాటిని వినియోగిస్తే కలిగే నష్టాలను వివరించారు. అంతకుముందు ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎం. పక్రుద్దీన్, ప్రిన్సిపాల్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కపట్నం: మండలకేంద్రంలో పోలీసులు విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పుట్టపర్తి రూరల్ ఎస్ఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. నేటితరం యువత, కార్మికులు, కర్షకులు మత్తుకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బుక్కపట్నం ఏఎస్ఐ రమణ, సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరిఅర్బన్: మండలంలోని కుమ్మవాండ్లపల్లి స్పేస్ కళాశాలలో రూరల్ సీఐ మోహన్ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు వాడడం వల్ల భవిష్యత్తు నాశనమవడంతో పాటు ఆరోగ్యమూ దెబ్బతింటుందని తెలిపారు. ఎవరూ వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు, వాడుతున్నట్లు తెలిస్తే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కదిరిలీగల్: మాదకద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని మండల న్యాయాధికారి సేవా సంస్థ ఛైర్‌పర్సన్, న్యాయాధికారి ఎస్. జయలక్ష్మి, అడిషనల్ జూనియర్ న్యాయాధికారి పి. మీనాక్షి సుందరి సూచించారు. మాదకద్రవ్యాల వినియోగానికి, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఇందుకు ప్రిన్సిపాల్ హరేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా న్యాయాధికారులు హాజరై మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ఆటవిక సాంప్రదాయమన్నారు. దాన్ని రూపు మాపడానికి అన్నివర్గాల వారు ముందుకు రావాలన్నారు. మాదక ద్రవ్యాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని సూచించారు. వాటివల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని, ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు. కనుక ఎవరూ కూడా వాటి జోలికి వెళ్లరాదని అన్నారు. సదస్సులో రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజా, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గాండ్లపెంట, జూన్ 26: మండల కేంద్రం సమీపంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిపై గతనెల 21వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన భాస్కర్ (38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎన్పీకుంట మండలం మేకలచెరువు పంచాయతీ కొండమూల కటకంవారిపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ గాండ్లపెంట సమీపంలో పెద్ద మిట్ట వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడన్నారు. కుటుంబసభ్యులు బెంగుళూరు, అనంతపురంలో చికిత్స చేయించారని, అయితే అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుడి భార్య రోజా ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ తిరుమలరెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

కళాకారుల సంఘం కమిటీ ఎన్నిక

కదిరిఅర్బన్, జూన్ 26: కదిరి తాలూకా కళాకారుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆసంఘం అధ్యక్షుడు ఖలీల్‌బాషా తెలిపారు. పట్టణంలో బుధవారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశామన్నారు. ఉపాధ్యక్షుడిగా నారాయణస్వామి, కార్యదర్శిగారెడ్డెప్పతో పాటు మరో 8మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

విద్యా సామగ్రి పంపిణీ

ముదిగుబ్బ,జూన్26: మండలంలోని గుడ్డంపల్లి తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం పలకలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. మండల కేంద్రానికి చెందిన సాయి ఫ్రూట్స్ నిర్వాహకుడు ఇందుకూరు సురేష్ వీటిని పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి

పుట్టపర్తి, జూన్ 26: కూటమి ప్రభుత్వంతో రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంది బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్వీజే కల్యాణ మండపంలో బుధవారం బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. దేశంలో నరేంద్రమోదీ రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి రావడం ఆనందదాయమన్నారు. కూటమితో రాష్ట్రం అన్నిరకాలు అభివృద్ధి చెందుతుందన్నారు. తర్వాత రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్‌గా జీఎం శేఖర్ నియమితులవడంతో ఆయన్ను పూలమాలలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణగౌడ్, హరినాయక్, మేకలశీనా, కొండమరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఇన్‌చార్జికి సన్మానం

కదిరిఅర్బన్, జూన్ 26: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవ ప్రసాద్‌కు బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు సన్మానం చేశారు. ఎన్పీకుంట మండల కన్వీనర్ మేకల చెరువు చౌదరి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి శాలువ కప్పి సత్కరించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తర్వాత మండలంలోని వంకమద్ది పంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను వివరించారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, దొడ్డయ్య, నాగభూషణం, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచట్టాలపై అవగాహన

ధర్మవరం,జూన్ 26: జూలై 1వ తేదీ నుంచి అమలు కాబోతున్న కొత్తచట్టాలపై ధర్మవరం సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందికి డీఎస్పీ శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని షిర్డీ సాయిబాబా కల్యాణమండపంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంకేతిక సాక్ష్యాల సేకరణ, భద్రపరచు విధానం, సాంకేతిక వినియోగం గురించి వివరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కోర్ ఐటీకోర్ వారిచే అమలు కాబోతున్న కొత్తచట్టాలను వివరించారు. సబ్ డివిజన్‌లోని సీఐ,ఎస్ఐలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- మంత్రి సత్యకుమార్‌తో కలిసి ధర్మవరాన్ని అభివృద్ధి చేస్తాం
- కబ్జారాయుళ్లను ఉపేక్షించేదే లేదు
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



ఎల్‌పీ సర్కిల్లో అన్నక్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం, జూన్ 26: ధర్మవరం నియోజకవర్గ ప్రజలు ఎంతో విశ్వాసంతో కూటమిని గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయమని, ఇక్కడి ప్రజలకు ఏ కష్టమొచ్చినా తీర్చడానికి నేను, మంత్రి సత్యకుమార్, జనసేన నేత చిలకం మధు సూదన్ రెడ్డి త్రిమూర్తుల్లా ముందుంటామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలో అమృత్ పథకం కింద మంజూరై ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లతో పాటు అన్నా క్యాంటీన్ భవనాలను బుధవారం ఆయన పరిశీలించారు. స్థానికంగా వివిధ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రం అవుతున్న దృష్ట్యా.. ఆయన మున్సిపల్ అధికారులను, సంబంధింత కాంట్రాక్టర్‌లను పిలిపించి అమృత్ పథకం కింద మంజూరైన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్నక్యాంటీన్ భవనాలను త్వరలోనే మరమ్మతులు చేసి పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ త్వరలోనే ధర్మవరం వస్తున్నారన్నారు. ఇక్కడి ప్రజలకు ఏయే సమస్యలున్నాయి, వాటిని ఎలా పరిష్కరించాలన్న దానిపై పూర్తి సమాచారాన్ని ఆయన దృష్టికి తీసుకెళతామని అన్నారు. ధర్మవరంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుతామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజల సొమ్మును దోచుకున్న వారిని , భూ కబ్జాలు చేసిన వారిని ఉపేక్షించేది లేదన్నారు. మంత్రి సత్యకుమార్ రాగానే వీటిపై పూర్తిగా సమీక్షించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్.నరేంద్రచౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, సందారాఘవ, నాయకులు పాల్గొన్నారు.

- పట్టణంలోని 40 వార్డులలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని పరిటాలశ్రీరామ్ పేర్కొన్నా రు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన బీజేపీ నేత సందిరెడ్డి శ్రీనివాసులుతో కలిసి అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడానికి అందరం సమష్టిగా కృషి చేద్దామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి లైంగిక వేధింపులపై విచారణ

చెన్నేకొత్తపల్లి, జూన్ 26 : లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న మండలంలోని ఎన్ఎస్ గేటు ప్రాథమిక ఆస్పత్రి వైద్యుడు ఉదయ్‌పై వైద్యుల కమిటీ బృందం బుధవారం విచారణ చేపట్టింది. తమను డాక్టర్ లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఆస్పత్రికి సంబంధించిన పలువురు ఏఎన్ఎంలు మంగళవారం పుట్టపర్తిలో డీఎంహెచ్ఓ మంజుల వాణికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు... వైద్యులు నివేదిత, అనూరాధ, వీరమ్మ, రామలక్ష్మమ్మలతో కూడిన కమిటీ బృందం బుధవారం ఎన్ఎస్‌గేటు ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టింది. ఫిర్యాదు చేసిన బాధితులతో పాటు ఆస్పత్రిలో పనిచేస్తున్న మిగిలిన ఏఎన్ఎంలందరిని ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించింది. విచారణ అనంతరం నివేదికను డీఎంహెచ్ఓకు అందజేస్తామని ఆ బృందం సభ్యులు తెలిపారు. కాగా, ఈ విచారణకు ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ ఉదయ్ గైర్హాజరయ్యారు.

డాక్టర్‌ను సస్పెండ్ చేయాలి

లైంగిక వేధింపులకు పాల్పడిన డాక్టర్ ఉదయ్‌ను వెంటనే సస్పెండ్ చేయడంతో పాటు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. స్థానిక ఆస్పత్రి ఎదుట సీఐటీయూ మండల నాయకులు లింగన్న ఆధ్వర్యంలో వారు బైఠాయించి నిరసన చేపట్టారు. విచారణకు వచ్చిన కమిటీ ఎదుట ఆ వైద్యుడు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు.



ఆస్పత్రి ఎదుట ఏఎన్ఎంల నిరసన

ల్యాబ్‌లు, ప్రథమచికిత్స కేంద్రాల తనిఖీ

తనకల్లు, జూన్ 26: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో గల ప్రథమి చికిత్స కేంద్రాలను, ల్యాబ్‌లను జిల్లా మాస్ మీడియా అధికారి బాబాఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ధర్మరాజు, ఎంపీహెచ్ఈఓ ఓబులేసు, హెల్త్ సూపర్‌వైజర్లతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా, తగిన విద్యార్హత లేకుండా కొందరు ల్యాబ్‌లు, ప్రథమచికిత్స కేంద్రాలు నిర్వహిస్తున్నటు సమాచారం అందిందని, దీంతో తనిఖీ చేపట్టామని తెలిపారు. కొక్కంటి క్రాస్‌లో 14 ప్రథమ చికిత్సకేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో ఎలాంటి అనుమతులు లేకుండా రోగులకు సెలైన్ బాటిళ్ల పెట్టడం, చిన్నారులకు నెబలైజర్లు వాడడం, మంచాలు ఏర్పాటు చేసి రోగులను అడ్మిట్ చేసుకోవడం వంటివి జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. మొదటి తప్పుగా భావించి, అలాంటివి చేయకూడదని నిర్వాహకులను హెచ్చరించామన్నారు. తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని కొంతమంది ల్యాబ్‌లు, ప్రథమచికిత్స కేంద్రాలను మూసివేసి వెళ్లిపోయారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు తప్పవని అన్నారు. కొంతమంది కనీస విద్యార్హత, అనుమతులు లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారన్నారు. వారిపై నివేదికలను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. పలు గ్రామాల్లో సైతం అనుమతులు, విద్యార్హత లేకుండా ప్రథమచికిత్స కేంద్రాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, సంబంధితాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు డీఈఎంఓ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన తనిఖీలు చేసి విచారణ చేపట్టాలని ఎంపీహెచ్ఓఈను ఆదేశించారు.



తనిఖీ చేస్తున్నట్లు తెలుసుకుని ల్యాబ్‌ను మూసివేసిన దృశ్యం

బడి ఈడు పిల్లలు.. బడిలోనే ఉండాలి

ఓబుళదేవరచెరువు, జూన్ 26: బడిఈడు పిల్లలను బడిలో చేర్పిద్దామని ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ పిలుపునిచ్చారు. నేను బడికి పోతా కార్యక్రమంపై మండలకేంద్రంలో బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ ప్రధాన వీధుల గుండా సాగింది. ఇందులో ఎంఈఓలు పాల్గొని మాట్లాడారు. 6నుంచి 14 ఏళ్ల లోపు వయసు గల బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. బడి మధ్యలో మానేసిన పిల్లలను తల్లిదండ్రులు చొరవ తీసుకుని తిరిగి బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, బూట్లు అందించడంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు నరసింహులు, అన్వర్ అలీ, జనార్ధన్, చెన్నకేశవులు, కేశవ, వెంకటేష్, సుధాకర్, రిజ్వానా, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

భూసమస్యలపై ప్రతివారం సమావేశం: జేసీ

పుట్టపర్తి, జూన్ 26: జిల్లాలో భూసమస్యలను పరిష్కరించడానికి ప్రతివారం సమావేశం నిర్వహిస్తామని, అందుకు తగు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏయే మండలాల్లో భూసమస్యలు అధికంగా ఉన్నాయో ఆయా తహసీల్దార్లు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. వివిధ కోర్టుల్లో ఉన్న కేసులను గుర్తించడంతో పాటు వాటిపై కౌంటర్ కేసులు వేశారా.. లేదా అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. అలాగే జిల్లాలో జాతీయ రహదారులకు భూములు కోల్పోయిన ప్రతిరైతును గుర్తించాలని, నష్ట పరిహారం అందజేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తర్వాత రైల్వేపనులపై భూసేకరణ, ఏపీఐఐసీ అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టరు అపూర్వభరత్, ఎస్‌హెచ్ అధికారి గిడ్డయ్య, ఆర్డీఓలు వెంకటశివారెడ్డి, భాగ్యరేఖ, ఏపీఐఐసీ జిల్లా అధికారి షహీనాసోనీ, పులువురు తహసీల్దార్లు, పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

పుట్టపర్తి రూరల్, జూన్ 26: జిల్లాకేంద్రంలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరోగ్యశ్రీ జి ల్లా అధికారిణి శ్రీదేవి, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలోని రికార్డులను, మందులను, వ్యాధినిరోధక టీకాలను, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్లను, నిల్వచేసే ఫ్రిడ్జ్‌లను, ల్యాబ్‌ను, కాన్పుల వార్డును పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ రోగులకు అందించే వైద్యసేవలపై సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన వారికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్లపై అవగాహన కల్పించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల క్షయవ్యాధి పూర్తిగా నయమవుతుందని, మళ్లీ తిరిగి రాదని తెలిపారు. ఐదేళ్లలో టీబీ వచ్చి తగ్గిపోయిన వారు, 60 ఏళ్ల వయసు నిండిన వారు, పొగ తాగేవారు, షుగర్ వ్యాధి ఉన్నవారు, ఎత్తుకు తగిన బరువు లేనివారు తప్పకుండా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. వైద్యాధికారి శ్రీకాంత్, సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, స్టాఫ్‌నర్సు అమ్మాజీ, ఆరోగ్యశ్రీ లీడర్లు, ఆరోగ్యమిత్రలు, ఫార్మాసిస్టులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రిలో మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ మంజువాణి

హాకీ టోర్నీ ప్రారంభోత్సవానికి ఆహ్వానం

ధర్మవరం, జూన్ 26: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఈనెల 27వ తేదీ నుంచి హాకీ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హాకీ టోర్నీ జరగనుంది. ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్‌ను నిర్వాహకులు బుధవారం ఆహ్వానించారు. ఈనెల 27 నుంచి 30వతేదీ వరకు 14వ సీనియర్ పురుషుల రాష్ట్రస్థాయి హాకీ టోర్నీ జరగనుందని, వీటి ప్రారంభోత్సవానికి రావాలని పరిటాలసునీతను, పరిటాలశ్రీరామ్‌ను వెంకటాపురానికి వెళ్లి ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు.



ఎమ్మెల్యే పరిటాల సునీతను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

మారెమ్మ జాతరకు మాజీ మంత్రి పల్లె హాజరు

కొత్తచెరువు, జూన్ 26: మండలంలోని అప్పలవాండ్లపల్లి గ్రామంలో గత రెండు రోజులుగా మారెమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. ఈ జాతరకు మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భం గా స్థానిక అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చే యించారు. తర్వాత మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నూతనంగా కొలువు తీరిన కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని తెలిపారు. రాక్షస పాలన పోయి.. రామరాజ్యం వచ్చిందన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. తొలుత గ్రామ మహిళలు ఆయనకు హారతి పట్టి స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మారెమ్మ ఆలయంలో పూజలో పాల్గొన్న పల్లె

రోడ్డుపై గుంతల పూడ్చివేత

ధర్మవరం, జూన్ 26: పట్టణంలోని కదిరిగేటు వద్ద రోడ్డుపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. వీటి వల్ల వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వచ్చినప్పుడు అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. ఇప్పటికే ఈ గుంతల వల్ల చాలామంది ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడ్డారు. ఈ సమస్యను స్థానిక కూటమి నాయకులు మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సత్యకుమార్, పరిటాలశ్రీరామ్ ఆ గుంతలను తక్షణమే పూడ్చివేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం వారు రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చి వేయించారు.



కదిరిగేటు వద్ద రోడ్డుపై గుంతను పూడ్చుతున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

గాండ్లపెంట, జూన్ 26: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఆదాయం చేకూరుతుందని ఎఫ్ఈఎస్ సంస్థ వారు సూచించారు. మండలంలోని తుమ్మలబైలు పంచాయతీ పోతినేపల్లి గ్రామంలో బుధవారం వారు రైతులతో సమావేశం నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని, సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు. అప్పుడే ఆదాయం పెరుగుతుందన్నారు. వర్షం కురవకపోయినా కొంతవరకు పంటలు తట్టుకుంటాయన్నారు. రసాయనిక ఎరువులతో పంటలు త్వరగా దెబ్బతింటాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఈఎస్ స్టేట్ హెడ్ భక్తర్‌వలి, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకు పరిశీలన

తనకల్లు, జూన్ 26: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద ఉన్న నీటి ట్యాంక్‌ను బుధవారం డీఎల్‌పీఓ అంజనప్ప, ఇన్‌చార్జి ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ పరిశీలించా రు. నీటి ట్యాంక్ తీవ్ర అపరిశుభ్రతంగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శుభ్రం చేయించాలని ఆదేశించారు. కలుషిత నీటి వల్ల వివిధ రోగాలు వచ్చే ప్రమాదముందని చెప్పారు. ట్యాంక్ వద్ద నీటి నిలువలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

నగర పంచాయతీ అభివృద్ధికి సహకారం అందిస్తా

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
● రూ.47లక్షల విలువచేసే చెత్త సేకరణ వాహనం ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ, జూన్ 26: నగర పంచాయతీ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తామని... పారిశుధ్యం, మంచినీరు, వీధి దీపాలకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రూ.47 లక్షల విలువచేసే నూతన చెత్త సేకరణ వాహనం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సవిత హాజరయ్యారు. మంత్రికి నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ బార్గవ, చైర్మన్ ఉమర్‌ఫారూక్, వైస్ చైర్మన్ అనీల్‌కుమార్, నందినిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పుష్పగుచ్ఛాన్ని అందించి పూలమాలలువేసి, శాలువను కప్పి ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి వాహనాన్ని పూజలు చేసి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వాహనాన్ని ఆమె స్వయంగా నడిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గం ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి మంత్రిని చేశారని వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. పెనుకొండ చరిత్రలో పెనుకొండ పట్టణంలో ఎన్నడూరాని మెజార్టీ తనకు ఇచ్చారని ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నగర పంచాయతీ, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్దామన్నారు. నగర పంచాయతీకి ప్రభుత్వపరంగా ప్రత్యేక నిధులు తెచ్చుకుని అభివృద్ధి పనులు చేపడదామన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో పెనుకొండలోని ప్రధాన కేంద్రాల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేయడంతోపాటు చెత్తను తరలించడానికి కొత్తగా వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు తెచ్చుకుని పెనుకొండ రూపురేఖలు మార్చుదామన్నారు. జూలై 1న ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీమేరకు కొత్తగా రూ.4వేలు పెన్షన్ తోపాటు మూడునెలల బకాయిలు రూ.3వేలు కలిపి రూ.7వేలు చెల్లిస్తారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకో వడం టీడీపీకే చెల్లుతుందన్నారు. జగన్‌రెడ్డి పెన్షన్ పెంచి వాయిదాలతో ఐదేళ్ల గడిపి ప్రజలను మోసం చేశాడన్నారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం అభివృద్ధి పనులపై నగర పంచాయతీ పాలకవర్గ సభ్యులతో సమావేశమయ్యారు.



బత్తాయి గజమాలతో ఎంఎస్ రాజు, గుండుమలను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు ఘనస్వాగతం

మడకశిరటౌన్, జూన్ 26: తెలుగుదేశం పార్టీ పాలనలో అవినీతికి ఆస్కారం ఉండదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అవినీతి రహిత పాలన అందిస్తారని అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా బుధవారం మడకశిరకు వచ్చిన ఎంఎస్ రాజుకు టీడీపీ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మడకశిర పట్టణం పసుపు మయంగా మారింది. ముందుగా పట్టణంలోని కొల్లాపురమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేలాది మంది కార్యకర్తల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. వాల్మీకి, అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరాపురం బస్టాండులో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత వైసీపీ పాలనలో నియోజకవర్గంలో చిన్న పని నుంచి పెద్ద పని వరకు ఒక ధర నిర్ధారించి వసూలుకు పాల్పడేవారని, టీడీపీ పాలన అభివృద్ధి తప్ప అవినీతికి ఆస్కారం ఉండదన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. ప్రధాన రహదారి మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని ఆనాడు సాక్షాత్తు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విన్నవించినా ఫలితం లేదని, అలాంటిది తాను గెలిచిన పది రోజుల్లోనే మార్చామన్నారు. రహదారి నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ ద్వారా రూ.15కోట్లు మంజూరు చేయించామన్నారు. గుండుమల తిప్పేస్వామికి, తన కు మధ్య విభేదాలు సృష్టించడానికి పలువువు కుట్రలు పన్నుతున్నారని, తనపై అనేక ఆరోపణలు చేస్తున్నారని, పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడిన వారిని ఉపేక్షించ బోనన్నారు. మడకశిరలో కలవడానికి మొహంలేక అనంతపురం వస్తున్నారని, అయినా వారి మోసాన్ని సహించనన్నారు. గుండుమల తిప్పేస్వామితో కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు చెప్పార ని, అధినేత ఆదేశాల మేరకు తాము రామలక్ష్మణుల్లాగా నియోజకవర్గం అభివృద్ధి కి కృషి చేస్తామన్నారు. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాగతం పలికిన ఆర్యవైశ్యులు



ఎంఎస్ రాజుకు స్వాగతం పలికేందుకు వెళుతున్న టీడీపీ ఆర్యవైశ్య నాయకులు

మడకశిరటౌన్, జూన్ 26: టీడీపీ ఆర్యవైశ్య సంఘం నాయకులు బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామిని ఘనంగా సన్మానించారు. అనంతరం వారితో పాటు పట్టణంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు కట్టా కిషోర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోట ఆదినారాయణ, మాకం ఇండస్ట్రీస్ రమేష్, కీర్తికృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌కు దమ్ముంటే అసెంబ్లీలో ప్రజాసమస్యలపై పోరాడాలి: ఎమ్మెల్యే రాజు

మడకశిర, జూన్ 26: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నిజంగా దమ్ముంటే శాసనసభకు వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడవచ్చని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. చట్ట విరుద్ధంగా ప్రతిపక్ష నాయకుడి హోదా ఎలా సాధ్యమన్నారు. వారు బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాసనసభ్యుడిగా మాత్రమే జగన్‌ను గౌరవిస్తామని, చట్టానికి అతీతంగా ప్రతిపక్ష హోదా కావాలంటే ఎలాఅన్నారు. చట్టం ప్రకారం అవకాశంలేని ప్రతిపక్ష స్థానాన్ని స్పీకర్‌కు లేఖరాసి, ముఖ్యమంత్రిని ప్రజల్లో తప్పుగా చూపాలని చూడడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. శాసనసభ్యుడిగా మీ హక్కులు కాలరాయాలని చూడడం లేదన్నారు. అలాగే చంద్రబాబును కుప్పంలో ఓడిస్తామని లేని పక్షంలో తాము రాజకీయ సన్యాసం తీసుకుంటానని అనిన కొడాలి నాని నేడు మాట తప్పుతున్నారని అన్నారు. ఇప్పటికైనా జగన్‌తో పాటు వైసీపీ నాయకులు ప్రజా సమస్యలపై పోరాడితే కనీస గౌరవం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, ఐదు మండలాల కన్వీనర్లు తదితరులు ఉన్నారు.

టీడీపీలోకి చేరిన వైసీపీ కౌన్సిలర్లు



కండువాలు వేసి కౌన్సిలర్లను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

మడకశిరటౌన్, జూన్ 26: నగర పంచాయతీకి చెందిన నలుగురు వైసీపీ కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టీడీపీలో చేరారు. నగర పంచాయతీ పరిధిలోని 18వ వార్డు కౌన్సిలర్ సావిత్రమ్మ బలరాం, 13వ వార్డు కౌన్సిలర్ సుజాతా రమేష్, 14వ వార్డు కౌన్సిలర్ వెంకటలక్ష్మమ్మ, ఆరో వార్డు కౌన్సిలర్ దాసప్ప తదితరులు టీడీపీలో చేరారు. వారికి ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఓబుళేశు, మాధవరాజు, కౌన్సిలర్లు రాజా, ఉమేష్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, భక్తర్ తదితరులు ఉన్నారు.

'సాహు మహరాజ్‌తోనే బహుజనులకు రిజర్వేషన్లు'

హిందూపురం అర్బన్, జూన్ 26: స్వాతంత్ర్య రాక మునుపే బహుజనులకు రాజ్యాధికారం అందించిన మహనీయుడు సాహు మహరాజ్ అని బహుజన సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు పేర్కొన్నారు. సాహు మహరాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకొని బుధవారం ఆబాద్‌పేటలోని బీఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ నాయకులు హరికుమార్, రామాంజి నేయు లు, సుబ్బరాయప్ప సత్యానందమూర్తి, నారాయణప్ప, శ్రీనివాసులు, చిరంజీవి, ఖలందర్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ వద్ద పారిశుధ్య పనులు

అగళి, జూన్ 26 : గత యేడు వర్షాభావం కారణంగా మండలంలోని పీ బ్యాడిగెర గ్రామంలో తాగునీటి పథకం బోర్లు ఎండిపోయాయి. దీంతో గ్రామంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ ఆరు నెలలుగా నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. దాని చుట్టూ కంపచెట్లు పెరిగాయి. అక్కడ అపరి శుభ్రత నెలకొంది. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు తాగు నీటి బోర్లలలో నీటి మట్టం పెరిగింది. దీంతో బుధవారం పంచాయతీ కార్యదర్శి ఫణిరాజా ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. వాటర్ ట్యాంకును త్వరలో ఉపయోగంలోకి తెస్తామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

నాలుగు తులాల బంగారు గొలుసు చోరీ

బుక్కరాయసముద్రం, జూన్ 26: అనంతపురం చెరువు కట్టపై బుధవారం రాత్రి ఓ మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు చైను చోరీకి గురైంది. అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డుకు చెందిన డి రాధమ్మ బుధవారం సాయంత్రం బుక్క రాయసముద్రంలో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లింది. ఆటోలో అనంతపురానికి వచ్చింది. పాతవూరు చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద నుంచి హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లేందుకు చెరువు కట్టపైకి నడిచి వెళ్తుండగా.. బైక్‌పై వచ్చిన ఓ దుండగుడు ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసులాక్కొని వెళ్లినట్టు ఆమె బుక్కరాయ సముద్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థికి పావగడ ఎమ్మెల్యే మద్దతు

పావగడ, జూన్ 26 : కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగదీశ్‌షెట్టర్ ఇటీవల ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో.... ఆ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ నుంచి వసవనగౌడ వాదర్లి కాంగ్రెస్ తరపున పోటీకి దిగారు. ఇందుకు పది మంది ఎమ్మెల్యేలతోపాటు పావగడ ఎమ్మెల్యే వెంకటేశ్ బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శివకుమార్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. వచ్చేనెల 12న ఎన్నికలు జరుగనున్నాయి.

తరచూ మరమ్మతులే..!

● నెలలో సగం రోజులు మున్సిపల్ కార్యాలయంలోనే చెత్త తరలించే వాహనం
● నగర పంచాయతీ పరిధిలో పేరుకుపోతున్న చెత్త



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిలిపిన వాహనం

మడకశిర టౌన్, జూన్ 26: నగర పంచాయతీలో చెత్తను తరలించే వాహనాన్ని దాదాపు ఆర్నెల్లుగా నెలలో సగం రోజులకు పైగా మరమ్మతుల కారణంగా నిలిపేస్తున్నారు. దీంతో చెత్తా చెదారం ఎక్కడి పడితే అక్కడే ఉంటోంది. ఇది పట్టణ వాసులకు ఇబ్బందికరంగా మారింది. ఇదిలా ఉండగా చెత్తను తరలించే కంపాక్ట్ వాహనం ఆగిన రోజుల్లోనూ డీజిల్ బిల్లులు డ్రా చేస్తున్నారనే ఆరోపణలు ఇటీవల వినిపిస్తున్నాయి. కావున వాహనానికి జీపీఎస్ ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. అయితే మున్సిపల్ అధికారులు మాత్రం వాహనం నడిచిన రోజుల్లోనే డీజిల్ బిల్లులు డ్రా చేస్తున్నట్లు చెబుతున్నారు. తరచూ మరమ్మతుల పేరిట వాహనాన్ని మున్సిపల్ కార్యాలయం వద్దే నిలిపివేస్తున్నారు. వాహనంలో ఆయిల్ ఫిల్టర్లు దెబ్బతిన్నాయని, అదేవిధంగా కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాహనాన్ని ఆపాల్సి వస్తోందని అధికారులు అంటున్నారు. అయితే వాహనం నిర్వహణ పట్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రద్ధ చూపడ లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా వాహనం వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతూ వాహనం కార్యాలయం ఎదుటే ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో నగరపంచాయతీ పరిధి లో పలుచోట్ల చెత్తాచెదారం నీటి ప్రవాహానికి కొట్టుకొని వచ్చి ఇళ్ల ముందు చేరుతోందని పట్టణ వాసులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఒక ట్రాక్టర్ ద్వారా చెత్తను తరలించాలంటే కార్మికులు సైతం ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. ఈ విషయాలను నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందిస్తూ.... వాహనం మరమ్మతుల దృష్ట్యా ఆగిపోయిందని తెలిపారు. అనంతపురం నుంచి మెకానిక్‌లు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే వారికి సమాచారం అందించామని వెంటనే మరమ్మతు చేయించి వినియోగంలోకి తెస్తామన్నారు. అలాగే వాహనం చెత్త తొలగించేందుకు వెళ్లినప్పుడు మాత్రమే డీజిల్ వేయిస్తున్నామని, మిగిలిన రోజుల్లో ఎలాంటి డీజిల్ బిల్లులు పెట్టుకోవడం లేదని తెలిపారు.



నగర పంచాయతీ కార్యాలయ సమీపంలో పడి ఉన్న చెత్త

ఘనంగా అష్టలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో వాసవీమాత

హిందూపురం అర్బన్, జూన్ 26: పట్టణ పరిధిలోని డీబీ కాలనీలో వెలసిని అష్టలక్ష్మీ ఆలయం ప్రథమ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ప్రాకారోత్సవం, 7 గం టలకు గణపతి ఆరాధన, స్వస్తి పుణ్యాహవాచనం, నవ గ్రహ ఆరాధన, కలశ స్థాపన చేపట్టారు. అనంతరం మహాకుంభాభిషేకం, హోమాలు, పూర్ణాహుతి జరిపారు. ఈ సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరి, అష్టలక్ష్మీ దేవతల మూలవిరాట్లను ప్రత్యేకంగా అలంకరించారు.



అలంకరణలో అష్టలక్ష్మి విగ్రహాలు

'డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువతే కీలకం'



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ, జూన్ 26: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించే బాధ్యత విద్యార్థి, యువత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, రెడ్ రిబ్బన్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ... తెలిసో తెలియకో ఈ మహమ్మారి బారినపడుతున్న యువతకు, గ్రామాల్లోని నిరక్షరాస్యులకు అవగాహన కల్పించే బాధ్యత విద్యార్థులు, యువత తీసుకోవాలన్నారు. డ్రగ్స్‌ను అరికట్టడంలో ప్రభుత్వాలు, ప్రజల బాధ్యతపై ప్రసంగించిన విద్యార్థులు నవీన్, బృందశ్రీని అభినందించారు. అనంతరం డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమవంతు బాధ్యత తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ యశోదరాణి, ఎన్‌సీసీ ఆఫీసర్ హరిప్రసాద్, కాంతారావు, రంగనాయకులు, అధ్యాపకులు శ్రీదేవి, సుజాత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'పిల్లల్లో ఆరోగ్యలోపాల గుర్తింపుపై శిక్షణ'

హిందూపురం అర్బన్, జూన్ 26: చిన్న పిల్లల్లో ఆరోగ్య పరంగా ఉన్న లోపాలను ఎలా గుర్తించాలి అనే అంశంపై వైద్యులు, నర్సులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా స్థాయి ప్రభుత్వ ఆసుపత్రిలోని డీఈఐసీ హాలులో డాక్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా.. పుట్టుకతో చిన్నారులకు వచ్చే వినికిడి లోపాలు, అంగవైకల్యం, శారీరక ఎదుగుదలలో లోపం, పౌష్టికాహార లోపం వల్ల వచ్చే వ్యాధులను ఏవిధంగా గ్రహించాలి అనే విషయాలపై శిక్షణ అందించారు. ఇటువంటి పిల్లలకు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డీఈఐసీ కేంద్రంలో ప్రత్యేక చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార కార్యాలయ సిబ్బంది హరి, స్థానిక సిబ్బంది, రఘురాం, డాక్టర్ అపర్ణ, ఆప్తో మెట్రీషియన్ సాయిక్రిష్ణ, సోషియల్ వర్కర్ మోహన్‌రెడ్డి, ఎల్‌టీ చందన తదితరులు పాల్గొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల, జూన్ 26: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరుకావాలని కోరారు. అలాగే ప్రజా ప్రతినిధులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరై గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

రొళ్ల, జూన్ 26: మండల పరిధిలోని రత్నగిరి బీసీ వసతి గృహాన్ని తహసీల్దార్ బద్రుజా, ఎంఈఓ శ్రీధర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార మెనూ, ఆహార నిల్వలు, రికార్డులు, శౌచాలయాల శుభ్రత తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ ఆహారం రుచి, బాత్‌రూమ్‌ల శుభ్రత గురించి అడిగి తెలుసుకొన్నారు. వసతి గృహంలో 76 మంది విద్యార్థులకుగాను 42 మంది మాత్రమే హాజరై ఉండడంతో.. మిగిలిన వారి గురించి ఆరా తీశారు. బీసీ హాస్టల్‌లో ట్యూటర్ లేనందు వల్ల భోజనం కాగానే వారి తల్లిదండ్రుల ఒత్తిడిమేరకు ఇళ్లకు వెళుతున్నారని వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు అధికారులకు తెలిపారు.

మహిళకు పాముకాటు

గోరంట్ల, జూన్ 26: మండలపరిధిలోని మల్లాపల్లికి చెందిన మహిళ రైతు నాగేంద్రమ్మ బుధవారం పాము కాటుకు గురై అస్వస్థతకు పొందారు. మల్లాపల్లికి చెందిన నాగరాజు భార్య నాగేంద్రమ్మ పొలంలో గడ్డి తొలగిస్తుండగా పాము కాటు వేసింది. అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, డాక్టర్ వినోద్ కుమార్ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

అనంతపురం క్రైం, జూన్ 26: కళ్యాణదుర్గం రోడ్డులోని సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలోని బీసీ కాలనీకి చెందిన రమాదేవి (58) మరణించింది. ఆమె తన భర్త సంజీవరాయుడుతో కలిసి బైక్‌పై అనంతపురం బయలుదేరారు. సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో వీరు యూట ర్న్ తీసుకొంటుండగా.. కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో రమాదేవి అక్కడి కక్కడే మరణించింది. సంజీవరాయుడికి స్వల్పగాయాలయ్యాయి. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి సవితకు పరిటాల సునీత సత్కారం



మంత్రి సవితను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పెనుకొండ టౌన్, జూన్ 26 : బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవితను మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కలిశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం రాప్తాడు నాయకులతో కలిసి బొకే అందించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత పరిటాల సునీతను శాలువాతో సత్కరించారు. పరిటాల సునీత మాట్లాడుతూ.. బీసీలకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందని మరోసారి నిరూపితమైందన్నారు. సవిత రాజకీయాల్లో ఎంతో కష్టపడి పైకి వచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమెకు సముచిత స్థానం కల్పించారన్నారు. మంత్రి సవిత బీసీలకు, చేనేతలకు న్యాయం జరిగేలా ఖచ్చితంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు మాధవనాయుడు, సర్పంచ్ శ్రీనివాసులు, మావటూరు గోపాల్, నీరుగంటి చంద్ర, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, అరుణ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, దాదు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి పాస్టర్ల ఆశీర్వాదం



మంత్రి సవితను ఆశీర్వదిస్తున్న పాస్టర్లు

పెనుకొండ, జూన్ 26 : బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి సవితను బుధవారం జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి ఆశీర్వాదాలు అందజేశారు. అసోసియేషన్ సభ్యుడు నాగరాజు, జాయింట్ సెక్రటరీ మణుషే, ట్రెజరర్ జీవన్, పెనుకొండ పాస్టర్ సుధాకర్ తదితరులు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

మంత్రికి ఏపీటీఎఫ్ నాయకుల వినతి

పెనుకొండ, జూన్ 26: ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు బీసీ వెల్ఫేర్‌శాఖ మంత్రి సవితకు విన్నవించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు, ఆర్ చంద్ర, గౌరవాధ్యక్షుడు మాధవ తదితరులు బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రచయితలను ప్రోత్సహించాలి

పెనుకొండ టౌన్, జూన్ 26: ప్రభుత్వం తరపున రచయితలను ప్రోత్సహిస్తూ, వారి పుస్తకాలు ముద్రించడానికి తగిన ఆర్థిక సహకారం అందించాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా మంత్రి సవితను కోరారు. పలువురు రచయితలు గురువారం మంత్రిని స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, మెమెంటోతో సత్కరించారు. రచయితలు భాస్కర్‌నాయుడు, శివన్న, హనుమంతు, ఉమర్‌ఫారూక్, అహ్మది, అమీర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

'బడి ఈడు పిల్లలు బడికి రావాల్సిందే'



చిలమత్తూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు



గౌరిగానిపల్లిలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ

చిలమత్తూరు, జూన్ 26: బడి ఈడు పిల్లలందురూ తప్పక బడికి రావాలని ఎంఈఓ సల్మాన్ రాజ్ పేర్కొన్నారు. విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంలో ప్రతి ఇంట్లో ఉన్న బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు బడికి పంపాలన్నారు.

లేపాక్షి : రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు బుధవారం గౌరిగానిపల్లిలో ఎంఈఓ నాగరాజునాయక్ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామంలో ర్యాలీ నిర్వహించి చదువు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమీక్ష: జేసీ

పుట్టపర్తి, జూన్ 26: జిల్లాలో భూసమస్యలను పరిష్కరించడానికి ప్రతి వారం సమావేశం నిర్వహిస్తామని, అందుకు తగు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏయే మండలాల్లో భూసమస్య లు అధికంగా ఉన్నాయో ఆ యా తహసీల్దార్లు నివేదికలు సిద్ధం చేయాలన్నారు.అలాగే జిల్లాలో జాతీయ రహదారులకు భూములు కోల్పోయిన ప్రతిరైతును గుర్తించాలని, నష్టపరిహారం అందజేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైల్వేపనులపై భూసేకరణ, ఏపీఐఐసీ అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టరు అపూర్వభరత్, ఎన్‌హెచ్ అధికారి గిడ్డయ్య, ఆర్డీఓలు వెంకటశివారెడ్డి, భాగ్యరేఖ, ఏపీఐఐసీ జిల్లా అధికారి షహీనాసోనీ, తహసీల్దార్లు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గాండ్లపెంట, జూన్ 26: మండల కేంద్రం సమీపంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిపై గతనెల 21వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన భాస్కర్ (38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎన్పీకుంట మండలం మేకలచెరువు పంచాయతీ కొండమూల కటకంవారిపల్లి కి చెందిన భాస్కర్ గాండ్లపెంట సమీపంలో పెద్ద మిట్ట వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడన్నారు. కుటుంబసభ్యులు బెంగుళూరు, అనంతపురంలో చికిత్స చేయించారని, అయితే అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుడి భార్య రోజా ఫిర్యాదు చేసిందని తెలిపారు.